సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



ఘనంగా ధ్వజావరోహణం

కడప శ్రీ విజయదుర్గాదేవి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. -8లో..



డీసీసీ బ్యాంక్‌లో డిపాజిట్లపై అధిక వడ్డీ

డీసీసీ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీని చెల్లిస్తుందని బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
35.5/17.8

వాతావరణం

జిల్లాలో బుధవారం 17.8 – 35.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

11, 12 తేదీలలో హెడ్‌మాస్టర్ అకౌంట్స్ టెస్ట్

కడప ఎడ్యుకేషన్: ప్రధానోపాధ్యాయులకు సంబంధించిన అకౌంట్స్ టెస్టు 11, 12 తేదీలలో నిర్వహించనున్నట్లు డీఈఓ దేవరాజు బుధవారం తెలిపారు. కడపలోని మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు డబ్లూడబ్లూడబ్లూ.బీఎస్‌సీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు.

ఏసీబీ కార్యాలయం తనిఖీ

కడప అర్బన్: కడప నగరంలోని కో–ఆపరేటివ్ కాలనీలో ఉన్న అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ కార్యాలయాన్ని బుధవారం ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణారావు తనిఖీ చేశారు. కార్యాలయంలో వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కంజాక్షన్, సీఐలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రపతి అవార్డు గ్రహీతకు సన్మానం



హెడ్ వార్డర్ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాష్

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ వార్డర్ నారాయణరెడ్డికి, ఆయన అందిస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపుగా 2020లో అప్పటి రాష్ట్రపతి అవార్డును ప్రకటించారు. ఈ ఏడాది జనవరి 26న రిపబ్లిక్ డే రోజున ఆ శాఖ డీజీ చేతుల మీదుగా ప్రధాన కార్యాలయంలో రాష్ట్రపతి అవార్డును హెడ్ వార్డర్ నారాయణరెడ్డికి ప్రదానం చేశారు. ఈ క్రమంలో ఆయనను బుధవారం కడప కేంద్రకారాగారం ఆవరణలో సూపరింటెండెంట్ ఐఎన్‌హెచ్ ప్రకాష్ ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను కొనియాడారు.

అర్హులకు న్యాయం జరుగుతుంది



ఆర్డీఓ శ్రీనివాసులును కలసి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు రూరల్ : మండలంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు తప్పనిసరిగా న్యాయం జరుగుతుందని ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి, ఆర్డీఓ సమక్షంలో భూములు కోల్పోయిన వారు తమ సమస్యలను వివరించారు. 2012–13 సంవత్సరంలో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా 317 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 187 మందిని మాత్రమే ఎంపిక చేశారని మిగిలిన 130 మందిని తొలగించడం జరిగిందన్నారు. వారిలో స్థానికేతరులు ఉన్నారని అధికారులు సూచించగా అలాంటి వారిని పక్కన పెట్టి స్థానికులకు న్యాయం చేయాలని కోరారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి అర్హులైన వారికి న్యాయం చేస్తామని ఆర్డీఓ సూచించారు. గతంలో కొంత మంది లబ్ధిదారులకు రెవెన్యూ అధికారులు ఇళ్ల పట్టాలు మంజూర్ చేశారని వాటిని లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటుంటే అధికారులు అడ్డుకుంటున్నారని బాధితులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావంతో ఆయన బాధితులతో కలసి ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పోరెడ్డి మహేశ్వరరెడ్డి, మార్చుల్ శ్రీను ఎంపీటీసీ అలిశెట్టి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

లింగాల: లింగాల మండలంంలో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. మండలంలోని ముఖారిచింతల గ్రామ సమీపంలోని పొలాల్లో నిర్మించిన రేకుల షెడ్డులో రేషన్ బియ్యం నిల్వ ఉంచారు. అక్కడ నుంచి బుధవారం అక్రమంగా తరలించేందుకు లోడింగ్ చేస్తున్నారనే సమాచారం తెలుసుకున్న రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 409 బస్తాల రేషన్ బియ్యం పట్టుకున్నారు. వీటి విలువ రూ.9,92,687లు నిర్ధారించారు. వీటితోపాటు రెండు టాటా ఐచర్ వాహనాలు, ఒక బొలెరో వాహనం, ఎస్కార్ట్ కోసం ఉపయోగించిన రెండు కార్లను పట్టుకున్నారు. పట్టుబడిన వీటి విలువ రూ.47,92,687లు నిర్ధారించారు. వీటిని సీజ్ చేసి లింగాల పోలీసుస్టేషన్‌కు తరలించారు. వీటితో పాటు 11 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్పీబీ ఉమామహేశ్వర్, విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, పులివెందుల సీఎస్‌డీటీ గోవిందరావు, ఆర్ఐ సురేంద్ర నాథ్ పాల్గొన్నారు. రేషన్ బియ్యాన్ని తహసీల్దారు శేషారెడ్డికి అప్పగించారు.

ఉవ్వెత్తున వెలుగులు

- ఆర్టీపీపీలో పూర్తి స్థాయి సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి
- 1650 మెగావాట్లకు గాను 1450 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి
- ఏడాదికిపైగా ఈస్థాయిలో చోటుచేసుకోని ఉత్పత్తి
- బొగ్గు కొరతకు చెక్.. ముందస్తు జాగ్రత్తలతో పెరిగిన నిల్వలు
- 42 వేల మెట్రిక్ టన్నులకు చేరుకున్న బొగ్గు నిల్వ



సాక్షి ప్రతినిధి, కడప: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) వెలుగులు నింపుతోంది. ప్రధానంగా రాయలసీమ ప్రాంత ప్రజలకు లోఓల్టేజీ సమస్యలను కట్టడి చేస్తోంది. విద్యుత్ కోతలకు ఆస్కారం లేకుండా ఆరు యూనిట్లు ద్వారా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. 1650 మెగావాట్లు సామర్థ్యానికి గాను 1450 మెగావాట్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఏడాదికి పైగా ఇంతటి సామర్థ్యంలో విద్యుత్ ఉత్పత్తి తీయలేదని అధికార యంత్రాంగం స్పష్టం చేస్తోంది. వినియోగదారుల అవసరాలకు తగ్గట్లుగా ఉత్పత్తి లభిస్తోంది. ఒక్కో యూనిట్ 210 మెగావాట్లు సామర్థ్యంతో 5 యూనిట్లు ఆర్టీపీపీలో నెలకొల్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒకటి, రెండవ యూనిట్లు నోచుకోగా, 3, 4, 5, 6 యూనిట్లు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రూపుదిద్దుకున్నాయి. 6వ యూనిట్ 600 మెగావాట్లు సామర్థ్యంతో నెలకొల్పడంతో మొత్తంగా 1650 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తికి ఆస్కారం ఏర్పడింది. కాగా 2014–19 టీడీపీ సర్కార్ హయాంలో తీవ్రమైన బొగ్గు కొరత ఏర్పడింది. ఆశించిన మేరకు విద్యుత్ ఉత్పాదన నోచుకోలేదు. ముందుచూపు లేకపోవడంతో టీడీపీ హయాంలో తరచూ బొగ్గు కొరత ఉత్పన్నమైందని కార్మికులు వివరిస్తున్నారు. కాగా ఏడాదిగా ఈ స్థాయి సామర్థ్యంతో ఉత్పత్తి చేయడం ప్రస్తుత ఉత్పత్తే అరుదు అని యంత్రాంగం వివరిస్తోంది.

దినదినాభివృద్ధి....

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు దినదినాభివృద్ధి వేగంగా చోటుచేసుకుంది. ఎన్టీ రామారావు హయాంలో అంకురార్పణ చేసి, తొలి యూనిట్‌ను ప్రారంభించి, రెండవ యూనిట్ పనులు కొనసాగించారు. ఆ పనులను చంద్రబాబు సర్కార్ పూర్తి చేయించింది. దివంగత సీఎం వైఎస్ హయాంలో అత్యంత వేగంగా ఒకదాని తర్వాత మరొకటి అన్నట్లుగా 3, 4, 5, 6 యూనిట్లు వేగంగా నిర్మించారు. వెరశి ఆర్టీపీపీకి 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తీసుకవచ్చారు. తద్వారా లో ఓల్టేజీ సమస్యకు చెక్ పడింది.

42 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు..

ఆర్టీపీపీలో అన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి చేపట్టాలంటే సుమారు రోజుకు 21 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కానున్నట్లు యంత్రాంగం వివరిస్తోంది. టీడీపీ సర్కార్‌లో ఐదేళ్ల కాలంలో తరచూ బొగ్గు కొరత ఉత్పన్నం కావడంతో ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ముందు చూపుతో వ్యవహరించింది. ఒకేసారి 6లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఆర్టీపీపీకి చేరాయి. దాంతో బొగ్గు కొరత అనే సమస్యే లేకుండా పోయిందని కార్మికవర్గాలు చెబుతున్నారు. ప్రస్తుతం 42వేల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఆర్టీపీపీలో సిద్ధంగా ఉన్నాయి.

డిమాండ్ ప్రకారమే విద్యుత్ ఉత్పత్తి

ఏపీ జెన్‌కో యాజమాన్యం సూచన మేరకు డిమాండ్‌ను బట్టి ఆర్టీపీపీలో విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నాం. ప్రస్తుతం 6 యూనిట్లు ద్వారా ఉత్పత్తి కొనసాగుతోంది. బొగ్గు కొరత అనే సమస్యే తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ఒకేసారి 6 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు చేరింది. ప్రస్తుతం ప్రతిరోజు 6నుంచి 7వ్యాగన్లు బొగు సరఫరా అవుతోంది. జెన్‌కో ఆదేశాల మేరకు 1650 మెగావాట్లుకు గాను 1450 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. అన్ని యూనిట్ల ద్వారా ఏకధాటిగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నాం. – మురళీకృష్ణ, సీఈ, ఆర్టీపీపీ

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలు
వైభవంగా చేపడతాం

- ఏప్రిల్ 5న కోదండ రామస్వామి కల్యాణం
- ముఖ్యమంత్రిచే పట్టు వస్త్రాల సమర్పణ
- టీటీడీ జేఈవో వీరబ్రహ్మం

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 30వ తేది నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తిరుమల తిరుమతి దేవస్థానం జేఈవో వీరబ్రహ్మం చెప్పారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆయన టీటీడీలోని వివిధ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్ష జరిపారు. దానికి ముందు రాజంపేటలోని 108 అడుగుల తాళ్ళపాక అన్నమాచార్య విగ్రహం ఆవరణలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం జేఈవో విలేకర్లతో మాట్లాడుతూ మార్చి 30వ తేది సాయంత్రం అంకురార్పణతో శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఏప్రిల్ 5వ తేది శ్రీ కోదండ రాముని కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పిస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో ఇప్పటికే సమీక్ష జరిపి అనేక సూచనలు చేశామన్నారు. బ్రహ్మోత్సవాలకు, స్వామి వారి కల్యాణానికి హాజరు అయ్యే భక్తులకు ఏ అసౌకర్యం కలగకుండా, అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నెల రోజుల ముందు నుంచే టీటీడీ ఈ పనులను ప్రారంభించిందని ఆయన తెలిపారు. కల్యాణోత్సవం సందర్భంగా ఏర్పాటు చేయాల్సిన గ్యాలరీలు, వాటిలోకి భక్తులను అనుమతించాల్సిన విధానం, భక్తులకు తాగు నీరు, అన్నప్రసాదాల పంపిణీ ఏర్పాట్లపై సమీక్ష జరిపామన్నారు. గ్యాలరీలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ సారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కల్యాణ వేదిక అలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా భక్తులను ఆకట్టుకునేలా నిర్వహిస్తామన్నారు. కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికి స్వామి వారి ముత్యాల తలంబ్రాలు అందేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టీటీడీ ఈవో ఎ.వి. ధర్మారెడ్డి రెండు వారాల్లో జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, విద్యుత్ విభాగం ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, డిప్యూటీ ఈవోలు గుణభూషణ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, ఈఈ సుమతి, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, డీఎఫ్‌వో శ్రీనివాస్, గార్డెన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎలక్ట్రికల్ డీఈ చంద్రశేఖర్, ప్రచురణల విభాగం ప్రత్యేక అధికారి రామరాజు పాల్గొన్నారు.



కల్యాణ వేదిక ఆవరణలో టీటీడీ అధికారులతో కలిసి పరిశీలన చేస్తున్న జేఈవో వీరబ్రహ్మం

గర్భిణుల్లో రక్త హీనత లేకుండా జాగ్రత్త వహించాలి



సమావేశంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది (ఇన్‌సెట్) సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కలెక్టర్ విజయ రామరాజు

కడప సిటీ : గర్భిణుల్లో, చిన్నారుల్లో రక్తహీనత లేకుండా జాగ్రత్త వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ విజయ రామరాజు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మాతా, శిశు మరణాల నిర్మూలన, బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిరోధ చట్టం, పోక్సో చట్టం, గృహ హింస చట్టంపై ఓఎస్డీ రఘునాథ్, చిల్డ్రన్స్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారులు, సూపర్‌వైజర్లతో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎనీమియా నివారణకు గర్భిణీలకు సరైన విధానంలో రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వీటి వల్ల జరిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. జిల్లాలో మాతా శిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. విటమిన్ లోపం ఉన్న పిల్లలకు, గర్భిణులకు మందులు అందజేయాలన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన పెంచాలన్నారు. సూపర్‌వైజర్లు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అందుబాటులో ఉండాలన్నారు. సీడీపీఓలు ఖచ్చితంగా రికార్డులను నిర్వహించాలన్నారు. తనిఖీల్లో రికార్డులు సరిగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైల్వేస్టేషన్లు తదితర ప్రాంతాల్లో అనాథ పిల్లలను గుర్తించి చైల్డ్‌కేర్ సెంటర్లకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళిశాఖ ఆదేశాల మేరకు ఈనెల 9వ తేది నుంచి 15వ తేది వరకు నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో జిల్లా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలను ప్రారంభిస్తున్నామని చేనేత జౌళిశాఖ అధికారి భీమయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు జిల్లా కలెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్నామన్నారు. అలాగే ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ జ్యోతి ప్రజ్వలన గావిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ సాయికాంత్‌వర్మ, కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్‌చంద్, చేనేత జౌళిశాఖ ఉపసంచాలకులు అనిల్‌సాహు, చేనేత జౌళిశాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు రాజారావు పాల్గొంటారన్నారు. ఈ ప్రదర్శనలో కాటన్, పట్టు వస్త్రాలతోపాటు పట్టు టై, డై చీరలు, సిక్కో చీరలు, ధర్మవరం, గద్వాల్, ఉప్పాడ, పోచంపల్లి, పట్టుచీరలు, మాధవరం, వెంకటగిరి, కాటన్ చీరలు, మంగళగిరి డ్రస్ మెటీరియల్స్, బందరు జరి చీరలు, జమదాని చీరలు, షర్టింగ్స్, కలంకారి వస్త్రాలు, పొందూరు, ఖద్దరు, సిల్క్ షర్టింగ్, ప్రఖ్యాతిగాంచిన ఎమ్మిగనూరు బెడ్‌షీట్లు, లుంగీలు, డ్రస్ మెటీరియల్స్, ఆకర్షణీయమైన వస్త్ర ఉత్పత్తులు సందర్శకులకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ప్రదర్శనలో రాష్ట్ర నలుమూలల నుంచి 30 చేనేత సహకార సంఘాల ఉత్పత్తిదారులు పాల్గొంటారన్నారు. చేనేతలను ప్రోత్సహిస్తూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హనుమద్వాహనంపై
శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పూలంగళ్ల వద్ద ఉన్న శ్రీరంగనాథస్వామి కాంప్లెక్స్‌లో జరుగుతున్న శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారు సతీసమేతుడై హనుమద్వావాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మండపంలో అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు పర్యవేక్షించారు. సాయంత్రం స్వామివారు హనుమద్వావాహనంపై పట్టణ పురవీధులలో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని మెయిన్ బజార్, ముత్యాలవారివీధి, గాడిచర్లవీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా ఊరేగారు.

ప్రత్యేక అలంకారంలో ముగ్ధమోహన రూపుడైన స్వామివారు తమ ఇంటి ముందుకు రాగానే భక్తులు చదుర్లు(ప్రత్యేక పూజలు) నిర్వహించారు. కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 6వ రోజు శుక్రవారం ఉదయం శ్రీరంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రేపు రంగనాథుని కల్యాణం



హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వాల కృషి

జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు షెహజాది



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది

కడప సిటీ : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయని, వారి సంక్షేమం కోసం మైనార్టీ జాతీయ కమిషన్ పాటుపడుతోందని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ప్రధానమంత్రి 15 సూత్రాల అమలు అనే అంశంపై సయ్యద్ షహజాది సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ విజయరామరాజుతోపాటు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జేసీ సాయికాంత్‌వర్మ, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌజులాజం, రాష్ట్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా, రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యులు హిదాయతుల్లా హాజరయ్యారు.

- ఈ సందర్భంగా షహజాది మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన జాతీయ మైనార్టీ కమిషన్ మైనార్టీల సంక్షేమానికి కేంద్రం, రాష్ట్ర శాసనసభలు చేసిన చట్టాల అమలు తీరును పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. మైనార్టీల హక్కులను విస్మరించే వారిపై కమిషన్ చట్టపరంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు.
- రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల్లో భాగంగా మైనార్టీ వర్గాలకు చెందిన పేదలు ఆర్థికంగా బలపడుతున్నారని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల్లో కూడా అమలు చేసేందుకు జాతీయ మైనార్టీ కమిషన్‌కు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్‌గౌడ్, జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కృష్ణ కిశోర్, బీసీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య, డ్వామా పీడీ యదుభూషణరెడ్డి, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, ఎస్ఎస్ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు, డీఈఓ దేవరాజు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి 15 పాయింట్ల కార్యక్రమాల అమలుపై సమీక్ష

ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి 15 పాయింట్ల కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. విద్య, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, ఉర్దూ బోధన, మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్ తదితర అంశాలను సమీక్షించారు. పేదలకు స్వయం ఉపాధి, వేతన ఉపాధి, సాంకేతిక శిక్షణ, గ్రామీణ గృహ నిర్మాణ పథకం, మురికి వాడల్లో నివసించే మైనార్టీ వర్గాల పరిస్థితిని మెరుగు పర్చడం, మత సామ రస్యం, శాంతి నెలకొల్పడం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.

- కలెక్టర్ విజయరామరాజు మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నామని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి

కలెక్టరేట్‌లోని వీసీ హాలులో సమీక్ష అనంతరం సయ్యద్ షహజాది విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుండి మైనార్టీ వర్గాలకు చెందిన కుల సంఘాల, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. ఉద్యోగ, వృత్తి పరంగా, ఆర్థికంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి పలు వినతులను స్వీకరించామని తెలిపారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో హజ్ భవన్, పెద్దదర్గా అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

కడప రూరల్: మైనార్టీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది అన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో వివిధ మైనార్టీ వర్గాల సంఘాల నేతలు, మత పెద్దలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాది మాట్లాడారు.

సభ్యురాలికి మైనార్టీ నేతల వినతులు....

ఈ సందర్భంగా మైనార్టీ నేతలు పలు సమస్యల పరిష్కారం కోసం కమిషన్ సభ్యురాలికి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కొంత మంది పార్టీల పేరు చెప్పుకొని ప్రసంగించడానికి ప్రయత్నించారు. దీనిపై కమిషన్ సభ్యురాలు అభ్యంతరం చెప్పారు. పార్టీల కతీతంగా ఈ సమావేశం జరుగుతోందన్నారు. కార్పొరేటర్ షఫి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి క్రిష్ణ కిషోర్ మైనార్టీ సంఘాల నేతలు, సంఘ సేవకుడు సయ్యద్ సలావుద్దీన్, నజీర్‌బాషా, దస్తగిరి, బాబు మొయినుద్దీన్, పాస్టర్లు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో ప్రార్థనలు



చాదర్ తీసుకు వస్తున్న సయ్యద్ షహజాది

కడప కల్చరల్: కడప అమీన్‌పీర్ (పెద్ద)దర్గాలో బుధవారం జాతీయ అల్పసంఖ్యాక మైనార్టీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షహజాది ప్రార్థనలు నిర్వహించారు. నగర పర్యటనకు విచ్చేసిన ఆమె సంబంధిత అధికారులు, సహచరులతో కలిసి దర్గాను దర్శించుకున్నారు. పూల చాదర్‌తో దర్గాకు చేరుకున్న ఆమెకు దర్గా ముజావర్ అమీర్ ఆమెకు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. తొలుత ఆమె దర్గాలోని హజరత్ పీరుల్లా మాలిక్ మజార్‌తోపాటు ఆ ప్రాంగణంలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకుని ప్రార్థనలు నిర్వహించారు.

• మహిమాన్వితురాలు మరియమాత



ప్రార్థన నిర్వహిస్తున్న గురువులు

కడప కల్చరల్ : మరియమాత మహిమాన్వితురాలని ఏలూరు జ్ఞాన కేంద్రం డైరెక్టర్ ఫాదర్ బెన్ని అన్నారు. కడప నగరం మరియాపురంలో లూర్దుమాత తిరునాల ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు బుధవారం పాత చర్చి ఆవరణలో ఆయన ప్రధాన వేదికపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. తొలుత దువ్వూరు విచారణ గురువు ఫాదర్ సుప్రియస్ దివ్య బలిపూజ నిర్వహించారు. అలంకరించిన పల్లకీపై మరియమాత ప్రతిమను ఏర్పాటు చేసి మరియాపురం వీధుల్లో వైభవంగా ఊరేగించారు. అనంతరం వేదిక వద్దకు చేర్చి ప్రార్థనలు నిర్వహించారు. దివ్య బలిపూజలో కొప్పర్తి విచారణ గురువు ఫాదర్ పి.బాలసుందరం, మరియాపురం విచారణ గురువు బిరుసురాజా, సహాయ గురువు కె.చంద్ర, ఫాదర్ జయప్రకాశ్‌రెడ్డి, ఫాదర్ మనోహర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తిరునాల కమిటీ అధ్యక్షులు వారాది జోసెఫ్, ఎస్.విజయరాజు, ఎ.జోజప్ప, ఎస్.దానం, యు.విజయభాస్కర్, ఆరోగ్యమాత విచారణ సిస్టర్లు పాల్గొన్నారు.

• ఘనంగా ధ్వజావరోహణం



ధ్వజావరోహణం కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు, నిర్వాహకులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయ 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఐదు రోజులుగా జరిగిన ఈ ఉత్సవాలలో చివరిరోజు కార్యక్రమాల్లో భాగంగా ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ కుటుంబ సమేతంగా భక్తులు, ఉభయదారులతో కలిసి యాగశాలలో మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కలశోద్వాసన చేసి, ఆ జలాలతో అవభృథ స్నపనం, శిఖర ప్రోక్షణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. బ్రహ్మోత్సవాల ముగింపు సూచకంగా ఆలయ పుష్కరిణిలో అర్చకులతో కలిసి త్రిశూలస్నానం నిర్వహించారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం వద్ద సింహ పతాక అవరోహణ చేసి మహిళల సంతాన ప్రాప్తి కోసం కుడిముద్దలను పంపిణీ చేశారు. రాత్రి శ్రీ విజయదుర్గ, మల్లికార్జునులకు పలు రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు.

చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త వీరయ్య

కడప అగ్రికల్చర్ : చిరుధాన్యాల సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించవచ్చని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్ర సయన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. చిరుధాన్య పంటల సాగు, మెళకువలపై తొల్లగంగన్నపల్లెలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. చిరుధాన్యాలు పండించే రైతులకు మంచి అవకాశమని తెలిపారు. చిరుధాన్యాలు దైనందిత ఆహార అలవాట్లలో భాగం కావాలని అన్నారు. మార్కెట్‌లో కూడా చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. రబీ శనగపంటకు ముందు ఖరీఫ్‌లో 62 రోజుల వ్యవధి గల కొర్ర రకాలను, వేసవిలో జొన్న, సజ్జ వంటి పంటలను సాగు చేసుకుని అధిక దిగుబడిని సాధించవచ్చన్నారు. అనంతరం చిరుధాన్య పంటల సాగు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త మురళీకృష్ణ, శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, స్వామి చైతన్య, మహేష్‌బాబు, రామలక్ష్మిదేవి పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంక్‌లో డిపాజిట్లపై అధిక వడ్డీ



మాట్లాడుతున్న బ్యాంక్ సీఈఓ రాజేంద్రకుమార్

కడప అగ్రికల్చర్ : కమర్షియల్ బ్యాంకులన్నిటి కంటే డీసీసీ బ్యాంకులో ఫిక్సిడ్ డిపాజిట్లపై అధిక వడ్డీని చెల్లిస్తుందని డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం కడపలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు మేనేజర్ శైలజ ఆధ్వర్యంలో బ్రాంచు ఖాతాదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ గత 104 ఏళ్ల నుంచి ఈ బ్యాంకు వివిధ సేవలు, రుణ సౌకర్యాలను ఖాతాదారులకు అందిస్తుందన్నారు. జిల్లా మొత్తంపైన అత్యధిక వడ్డీ ఇస్తున్న బ్యాంకు కడప డీసీసీ బ్యాంకు మాత్రమేనని అన్నారు. 333 రోజుల డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు అత్యధికంగా 7.80 వడ్డీ రేటును చెల్లిస్తుందన్నారు. అలాగే తక్కువ అద్దెకు లాకరు సదుపాయం ఖాతాదారులకు కల్పించామన్నారు. త్వరలో డీసీసీ బ్యాంకులో మొబైల్ యాప్, ఇతర డిజిటల్ లావాదేవీలు జరుపుకొనుటకు కావాల్సిన అనుమతులు వచ్చాయని తెలిపారు. డీసీసీ బ్యాంకు ద్వారా చిరు వ్యాపారులు సులభ వాయిదాల్లో చెల్లింపు, తక్కువ వడ్డీతో ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుండా రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. డీసీసీ కడప బ్రాంచ్ మేనేజర్ శైలజ మాట్లాడుతూ ఇతర కమర్షియల్ బ్యాంకులతో సమానంగా అన్ని రకాల రుణ సదుపాయాలు, వాహన కొనుగోళ్లు, పిల్లల చదువుకు విద్యారుణం, గృహ నిర్మాణ రుణ సదుపాయాలు కల్పిస్తుందన్నారు. ఈ సమావేశంలో డీజీఎంలు వై.ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, నోడల్ ఆఫీసర్ జీవీ బ్రహ్మం పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్‌లో 332 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపిన వారిపై మొత్తం 332 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపిన వారిపై 326 కేసులు, సీటు బెల్ట్ ధరించకుండా వెళ్తున్న కార్లు, జీపులు తదితర వాహన డ్రైవర్లపై 6 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

గుండ్లకుంట వీఆర్వో ఆత్మహత్యాయత్నం

- అవినీతికి పాల్పడమన్నారని సూసైడ్ నోట్
- ఖండించిన తహసీల్దార్

పెద్దముడియం : గుండ్లకుంట గ్రామానికి చెందిన వీఆర్వో శివకుమార్ బుధవారం విషగుళికలు మింగి ఆత్మహత్యకు ప్రయత్నించిన సంఘటన జమ్మలమడుగులో చోటు చేసుకుంది. స్నేహితుల సమాచారం ప్రకారం.. పెద్దముడియం గ్రామానికి చెందిన శివకుమార్ గుండ్లకుంట గ్రామంలో వీఆర్వో విధులు నిర్వహిస్తున్నాడు. గత కొద్ది నెలల నుంచి మండల తహసీల్దార్ మ్యుటేషన్‌లను ఆన్‌లైన్ చేయటానికి రైతుల నుంచి డబ్బులు వసూలు చేయాలని ఒత్తిడి చేస్తుండంతో.. విధి లేని పరిస్థితులలో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ లెటర్ రాసి ఈ అఘాయిత్యానికి ప్రయత్నించినట్లు సమాచారం. శివకుమార్‌ను కుటుంబీకులు మొదట జమ్మలమడుగులోని హాస్పిటల్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలులోని ప్రవేట్ హాస్పిటల్‌కు తరలించారు. దీనిపై తహసీల్దార్ జ్యోతి రత్నకుమారిని వివరణ అడగగా.. మ్యుటేషన్‌లకు డబ్బులు అడగడం, వేరే వాటికి కూడా డబ్బు ఇవ్వాలని అతనిపై ఎటువంటి ఒత్తిడి చేయలేదని, అతని వ్యక్తిగత సమస్యల వల్ల ఆత్మహత్యకు ప్రయత్నించాడని తెలిపారు.

ఎగువ భద్ర ప్రాజెక్టుతో సీమకు అన్యాయం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య

కడప వైఎస్సార్ సర్కిల్ : కర్ణాటకలోని ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణంతో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. బుధవారం నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణం–రాయలసీమ నీటి సమస్యలు అనే అంశంపై అఖిలపక్ష నేతలు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర పైభాగంలో ఎగువ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించి రూ. 22 వేల కోట్ల అంచనా వ్యయం నిర్మాణానికి మొదట విడతగా 2023–24 వార్షిక బడ్జెట్‌లో రూ.5300 కోట్లు నిధులు కేటాయించిందన్నారు. అంతర్ రాష్ట్ర నది వివాదాల చట్టం 1955 ప్రకారం కృష్ణానది నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం 75 శాతం నీటి లభ్యత ఆధారంగా ఏపీకి 811 టీఎంసీలు, కర్ణాటకకు 34 టీఎంసీలు, మహారాష్ట్రకు 586 టీఎంసీలు కేటాయించారన్నారు. తర్వాత ఏర్పాటైన బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ 65 నీటి లభ్యత ఆధారంగా వరద జలాలను లెక్క గట్టి మూడు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు లెక్క చేయడాన్ని సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం దావా నడుస్తోందన్నారు. కర్ణాటక రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నీటి కేటాయింపులు లేని ఎగువ భద్ర ప్రాజెక్టుకు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఎగువ భద్ర ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 12న కోటిరెడ్డి సర్కిల్‌లో నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు చంద్ర, దస్తగిరిరెడ్డి, చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, సత్తార్, రవిశంకర్‌రెడ్డి, కొమ్మద్ది ఈశ్వరయ్య, నాగేశ్వరరావు, జయన్న తదితరులు పాల్గొన్నారు.

గండికోట మరింత అభివృద్ధి

- అందరూ సహకరించాలి
- గండికోట వాసుల సమావేశంలో ఆర్డీఓ



మాట్లాడుతున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు : పర్యాటక కేంద్రమైన గండికోట భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందని, దానిని దృష్టిలో పెట్టుకుని గ్రామస్తులందరూ సహకరించాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయ సభా భవనంలో పర్యాటక శాఖ అధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పర్యాటకుల కోసం గండికోట గ్రామస్తులు ఇష్టారాజ్యంగా ఎక్కడ పడితే అక్కడ టెంట్‌లు వేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం వ్యవసాయం కోసం ఇచ్చిన అసైన్డు భూముల్లో ఇష్టారాజ్యంగా లాడ్జిలను ఏర్పాటు చేసి అందులో అసాంఘిక కార్యాకలాపాలు చేయించడం సరైంది కాదన్నారు. గండికోట పూర్తిగా రెవెన్యూ, పర్యాటక, పోలీసు అధికారుల పరిధిలో నియంత్రించడం జరుగుతుందన్నారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీలను తయారు చేసి కమిటీ నిర్ణయించిన ధరలు మాత్రమే పర్యాటకుల వద్ద వసూలు చేయాలన్నారు. రూములు బాడుగలకు ఇచ్చి చెత్త చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయడం ద్వారా వాటిని శుభ్రం చేయడం కష్టం అవుతుందన్నారు. రోడ్లు, కాలువలు లేవని, టెంట్ యజమానులు తమ వ్యాపారాలు జరగడం కోసం మందు సప్లయి చేసి వాటిని అక్కడే పడేసిపోతున్నారు. వాటిని ఎవరు శుభ్రం చేయాలని ప్రశ్నించారు. కాబట్టి ప్రతి ఒక్కరూ గండికోట పంచాయతీ అధికారులకు తమవంతు బాధ్యతగా సహకరించాలన్నారు. త్వరలో గండికోట టూరిజం హబ్‌గా మారబోతుందన్నారు. రోప్‌వే పనులు సైతం త్వరలో ప్రారంభం అవుతాయన్నారు.ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, తహసీల్దార్ తిరుపతయ్య, గండికోట సర్పంచ్ గురుఈశ్వర్, రెవెన్యూ, టెంట్, లాడ్జిల యజమానులు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

నూతన కలెక్టరు ఆఫీస్ కాంప్లెక్స్ నందు పొరుగు సేవల ఏజెన్సీ ద్వారా SECURITY పనులను చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది.

దరఖాస్తులు 09.02.2023వ తేది నుండి 16.02.2023 తేది మధ్యాహ్నం 3.00 గంటల వరకు కలెక్టరు కార్యాలయము (సి. బ్లాక్) నందు లభించును. దరఖాస్తుదారులు దరఖాస్తు కొరకు రూ.500/-లు జాయింట్ కలెక్టరు, కడప పేరున డి.డి. చెల్లించి దరఖాస్తును స్వీకరించవలెను. పూర్తి చేసిన దరఖాస్తును 16.02.2023వ తేదీ మధ్యాహ్నం 3.00 గంటల సమయం లోపు సమర్పించవలెను. 16.02.2023వ తేదిన సాయంత్రం 4.00 గంటలకు టెండర్లు తెరవబడును.

అన్ని అర్హతలు మరియు షరతుల గురించి దరఖాస్తుతో పాటు ఇవ్వబడును.

జాయింట్ కలెక్టర్ / ఛైర్మన్

పత్రికా ప్రకటన

వై.యస్.ఆర్ జిల్లా, నూతన కలెక్టరు వారి కార్యాలయం నందు కంప్యూటర్స్, లాప్ టాప్స్, ప్రింటర్లు, మరియు స్కానర్లు కొనుగోలు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది.

కంప్యూటర్స్, లాప్ టాప్స్, ప్రింటర్లు, మరియు స్కానర్లు (configuration) వివరాలు 09.02.2023 వ తేది నుండి 17.02.2023 వ తేదీ మధ్యాహ్నం 02.00 గంటల వరకు పరిపాలన అధికారి, కలెక్టరు వారి కార్యాలయము (సి. బ్లాక్) నందు లభించును. దరఖాస్తుదారులు దరఖాస్తు కొరకు రూ. 500/-లు జాయింట్ కలెక్టరు, కడప పేరున డి.డి. చెల్లించి దరఖాస్తును స్వీకరించవలెను. పూర్తి చేసిన దరఖాస్తును 17.02.2023వ తేది మధ్యాహ్నం 03.00 గంటల సమయం లోపు సమర్పించవలెను. 17.02.2023వ తేదిన సాయంత్రం 04.00 గంటలకు టెండర్లు తెరవబడును.

అన్ని అర్హతలు మరియు షరతుల గురించి దరఖాస్తు తో పాటు ఇవ్వబడును.

సం/- సి. యం. సాయికాంత్ వర్మ, ఐ.ఎ.యస్.,
జాయింట్ కలెక్టర్ /ఛైర్మన్, డి.పి.సి., కడప.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
క్రీడలు మరియు యువజనుల శాఖ
డాక్టర్. వై. యస్.ఆర్. రాష్ట్ర క్రీడా పాఠశాల, కడప.

టెండర్ నోటీసు

ఆర్.సి.నెం:వై.యస్.ఆర్.యస్.యస్./కడప/కొనుగోలు/2022-23 తేది: 08.02. 2023

డాక్టర్ వై యస్ ఆర్ క్రీడా పాఠశాల, కడప యందు చదువుచున్న విద్యార్థిని విద్యార్థులకు ఈ క్రింది వస్తువులు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు కోరడమైనది.

టెండరు నెం.	సరఫరా చేయవలసిన వస్తువులు	టెండరు ఫారం రుసుము రూ.లలో (D.D. రూపంలో స్పెషల్ ఆఫీసర్ వారి పేరు మీద తీసి జతపరచవలెను)	EMD రుసుము రూ.లలో (D.D. రూపంలో స్పెషల్ ఆఫీసర్ వారి పేరు మీద తీసి జతపరచవలెను)
టెండరు నెం.1	Mattress (పరుపు), పిల్లోస్ (దిండ్లు)	2,000/-	15,000/-
టెండరు నెం.2	స్పోర్ట్స్ కిట్ (ట్రాక్ సూట్, T.షర్ట్ - షూస్)	2,000/-	37,500/-

ఆసక్తిగల బిడ్డర్లు పైన తెలిపిన టెండర్ ఫారం రుసుముతో ఏదేని నేషనలైజ్డ్ బ్యాంకు డిమాండ్ డ్రాఫ్ట్ రూపములో స్పెషల్ ఆఫీసర్ పేరిట చెల్లించి టెండర్ డాకుమెంట్స్ తేదీ 09.02.2023 నుండి 16.02.2023 మధ్యాహ్నం 1:00 వరకు కార్యాలయ పనివేళల్లో పొందవలెను. లేదా క్రీడా పాఠశాల వెబ్ సైట్ www.apysrsportsschool.in నుండి డౌన్లోడ్ చేసుకొని, పైనతెలిపిన డిమాండ్ డ్రాఫ్ట్ ను జతపరచవలెను.

పైన పేర్కొన్న ప్రతి టెండర్ కు ప్రత్యేక టెండర్ ఫారం రుసుము మరియు EMD రుసుములను సమర్పించవలెను. టెండర్ రద్దు చేయుటకు, తేదీ పొడిగించుటకు సర్వాధికారము జాయింట్ కలెక్టర్ - ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, కడప వారికి కలదు.

సం/- జాయింట్ కలెక్టర్ – అధ్యక్షులు, జిల్లా కొనుగోలు కమిటీ, కడప.

కడప నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి.నెం.: 1321/G1/2022 తేది: 08.02.2023

ఆసక్తి వ్యక్తీకరణ
(శ్మశాన వాటిక మరియు విద్యుత్ శ్మశానవాటిక స్థాపనకు)

కమీషనర్, కడప నగరపాలక సంస్థ వారు ఆసక్తిగల స్వచ్ఛంద సేవా సంస్థల నుండి శ్మశాన వాటిక మరియు విద్యుత్ దహన యంత్రములను వారే ఏర్పాటు చేసి శ్మశాన వాటికను లాభాపేక్ష లేని (NO PROFIT NO LOSS) ప్రాతిపదికన నిర్వహించుటకు గాను, సర్వే నెం. 173, పుట్లంపల్లి (V) నందలి భూమిని లీజు ప్రతిపదకన ఇవ్వడానికి ప్రతిపాదన చేసియున్నారు. ఆసక్తి గల స్వచ్ఛంద సేవా సంస్థ దహన క్రియలకు సంబంధించిన సమస్త కార్యములను నిర్వహించుట కొరకు తగిన వ్యవస్థను ఏర్పాటు చేయునిమిత్తము కడప నగరపాలక సంస్థ శ్మశాన వాటికను నిర్వహించుటకు కేవలం భూమిని మాత్రమే లీజుకు ఇవ్వబడును, లీజు నవనీకరణ కూడా కాలానుగుణంగా చేయబడును.

సదరు ప్రతిపాదనలను కమీషనర్, కడప మునిసిపల్ నగరపాలక సంస్థ కార్యాలయము నందు నిర్దేశించిన ఫార్మాట్‌లో EOI లను సమర్పించడానికి చివరి తేదీ 15.02.2023 సాయంత్రం 5.00 గంటలలోపు.

ఆసక్తి గల సంస్థలు ఈ క్రింది తెలిపిన సర్టిఫికెట్స్ తో ఆసక్తి వ్యక్తీకరణ (EOI) సమర్పించవలెను:

1. స్వచ్ఛంద సేవా సంస్థ యొక్క రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్
2. కనీసం 10 సంవత్సరాల నిర్వహణ చరిత్ర కలిగి స్వచ్ఛంద సేవా సంస్థ యొక్క సమగ్ర విధానము, పని తీరుకు సంబంధించిన వివరములు సమర్పించాలి.
3. స్వచ్ఛంద సేవా సంస్థ యొక్క చట్టం పరిధి మేరకు సంస్థ తన కార్యక్రమములను నిర్వహించుచుండవలెను.
4. గత ఐదు సంవత్సరాలు గా వారు నిర్వహించుచున్న పరిధిలో అనుభవంనకు సంబందించిన ఆధారాలు సమర్పించవలెను.
5. స్వచ్ఛంద సేవా సంస్థ యొక్క కనీసం 3 సంవత్సరాల ప్రస్తుత బ్యాంక్ ఖాతా స్టేట్మెంట్ లేదా ధృవీకరణ
6. సదరు స్వచ్ఛంద సేవా సంస్థ పైన తెలిపిన ప్రతిపాదిత కార్యక్రమమునకు సంబంధించి సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికను వారి విధి విధానాలను సమర్పించాలి.

మరిన్ని వివరాల కోసం పి. నాగేంద్ర, అసిస్టెంట్ సిటీ ప్లానర్, కడప నగరపాలక సంస్థ, వారిని సంప్రదించ వలసినదిగా తెలియజేయడమైనది.

సం/- శ్రీ సూర్య సాయి ప్రవీణ్ చంద్
కమీషనర్,
కడప నగరపాలక సంస్థ

ఏసీబీ డీఎస్పీకి సేవా పతకం



కంజాక్షన్

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి నిరోధకశాఖలో పని చేస్తున్న అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం వారి సేవలకు గుర్తింపుగా ఈ నెల 6న 16 మందికి సేవా పతకాలను ప్రకటించారు. ఈక్రమంలోనే కడప ఏసీబీ విభాగం డీఎస్పీ పి.కంజాక్షన్‌కు ఏపీ స్టేట్ పోలీస్ సేవా పతకంను ప్రకటించారు. ఈ సందర్భంగా కడపలో పని చేస్తున్న సీఐలు, ఎస్‌ఐలు సిబ్బంది హర్షం వ్యక్తం చేయడంతోపాటు ఆయనకు శుభాకాంక్షలను తెలియజేశారు.

ప్రొద్దుటూరు చేనేతకు అరుదైన ఘనత

– జర్మనీలో నిర్వహించిన అంతర్జాతీయ వస్త్ర మేళాలో కడప రామిశెట్టి



వస్త్ర మేళాలో పాల్గొన్న కడప రామిశెట్టి

ప్రొద్దుటూరు క్రైం : జిల్లాలోని ప్రొద్దుటూరుకు చెందిన కడప రామిశెట్టికి అరుదైన అవకాశం దక్కింది. జర్మనీలో నిర్వహించిన అంబియంట్–2023 అంతర్జాతీయ ట్రేడ్ ఫెయిర్‌లో ఏపీ నుంచి కడప రామిశెట్టి పాల్గొన్నారు. జర్మనీలోని ఫ్రాంక్ ఫర్టర్‌లో ఈ నెల 7వ తేది వరకు వస్త్రప్రదర్శన నిర్వహించారు. ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన వస్త్రాలను ఇక్కడ ప్రదర్శించారు. అంతర్జాతీయ ప్రదర్శనలో పాల్గొనేందుకు హ్యాండ్లూమ్ ఎక్స్‌పర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (హెచ్‌ఈపీసీ) ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రొద్దుటూరులోని వసంతపేటకు చెందిన కడప రామిశెట్టి ఎంపికైనట్లు విజయవాడలోని చేనేత అభివృద్ధి కమిషనర్ హమిజకుమార్ తెలిపారు. ప్రొద్దుటూరు పరిసర ప్రాంతాల్లో మగ్గాలపై నేసిన డుపియన్, డ్రెస్ మెటీరియల్, గృహోపకరణ వస్త్రాలను జర్మనీలోని అంతర్జాతీయ వస్త్ర మేళాలో ప్రదర్శించి వ్యాపార అవకాశాలు పొందే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సూక్ష్మసేద్యంపై అవగాహన కల్పించాలి

కడప అగ్రికల్చర్ : సూక్ష్మ సేద్యానికి ఫిబ్రవరి, మార్చి నెలల్లో అధిక డిమాండ్ ఉంటుందని, కావున రైతు భరోసా కేంద్ర ఇన్‌చార్జీలు రైతులకు సూక్ష్మసేద్యంపై అవగాహన కల్పించాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. బుధవారం కడప ఏపీఎంఐపీ పీడీ కార్యాలయంలో సిబ్బందితోపాటు ఎంఐ ఏఓలు, ఎంఐ జిల్లా కంపెనీ ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి 9450 హెక్టార్లలో బిందుసేద్యం, 3150 హెక్టార్లలో తుంపర సేద్యాన్ని లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈ లక్ష్యం మార్చి చివరి నాటికి పూర్తి చేసే విధంగా అందరూ కలసికట్టుగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, ఎంఐ ఇంజనీర్లు, ఎంఐ డీసీలు, ఎంఐఏఓలు, జిల్లా కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో వ్యక్తి గల్లంతు

దువ్వూరు : మండల పరిధిలోని ఇడమడక గ్రామం వద్ద బుధవారం కేసీ కెనాల్‌లో బాలకృష్ణ అనే వ్యక్తి గల్లంతయ్యాడు. పొలం పనులు ముగించుకుని కేసీ కెనాల్‌లో ఈత కొట్టేందుకు దిగి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు గాలించినా అతని ఆచూకీ కనిపించలేదు.

అడవి జంతువు మృతి

సిద్ధవటం : సిద్ధవటం దిగువపేటలోని పోలేరమ్మ గుడి వద్ద బుధవారం అడవి పంది మృతి చెందింది. మధ్యాహ్నం వేళ అటవీ ప్రాంతం నుంచి అడవి పంది సిద్ధవటం దిగువపేట బేల్దారి వీధిలోని పోలేరమ్మ గుడి వద్దకు వచ్చింది. కొద్ది సేపు అక్కడే పడుకొని అనంతరం రక్తం కక్కి మృతి చెందినదని స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న సిద్ధవటం అటవీశాఖ బీటు అధికారి రాజశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకొని పరిశీలించారు. అనంతరం సిద్ధవటం రేంజర్ ప్రసాద్ ఆదేశాల మేరకు మృతి చెందిన పందిని సిద్ధవటం పశువుల ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. విషపురుగు కాటు వేయడం వల్ల ఆరోగ్యం విషమించి మృతి చెందినదని పశువైద్యాధికారి వెల్లడించారు.

ఫార్మెటివ్ అసెస్‌మెంట్ పరీక్ష కేంద్రాలు తనిఖీ



పరీక్షలను పరిశీలిస్తున్న రాష్ట్ర అసెస్‌మెంట్ సెల్ సభ్యుడు గంగరాజు

కడప ఎడ్యుకేషన్ : జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన ఫార్మెటివ్ అసెస్‌మెంట్ –2 పరీక్షా కేంద్రాలను రాష్ట్ర విద్యా పరిశోధన మండలి రాష్ట్ర అసెస్‌మెంట్ సెల్ సభ్యుడు గంగరాజు బుధవారం పరిశీలించారు. ఇందులో భాగంగా కడప మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ మెయిన్, ఖాజీపేట జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్, పెండ్లిమర్రి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో జరుగుతున్న క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ పరీక్షను పరిశీలించారు. పరీక్షల స్వభావాన్ని రాష్ట్ర అధికారులకు నివేదించడానికి ఈ నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటించనున్నారు. ఇందులో భాగంగానే మొదటి రోజు పైమూడు స్కూల్స్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.